ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.4, కనిష్ఠం 23.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
సోమవారం 7 అక్టోబరు 2024



ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలు

భైంసా, అక్టోబరు 6: పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి భైంసా ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు రూ.5,11,000 కరెన్సీతో అలంకరించారు. రూ.500,200,100,50,20,10 నోట్లతో పరమేశ్వరి దేవి విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణ పరిధిలోని ఆయా కాలనీల్లోని ఆర్యవైశ్యులతో పాటు ఇతరులు అధిక సంఖ్యలో పూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

కుష్మాండ దేవిగా బాసర అమ్మవారు



కుష్మాండ దేవి అలంకరణలో అమ్మవారు

బాసర, అక్టోబరు 6: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల నాల్గో రోజు కుష్మాండ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కుష్మాండ దేవి అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తుల కోసం దేవస్థానం తరపున అన్నదానం ఏర్పాటు చేశారు.

క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్ • సీఎం కప్ ర్యాలీకి నిర్మల్‌లో ఘన స్వాగతం


నిర్మల్ కల్చరల్, అక్టోబరు6: సీఎం కప్ 2024 ర్యాలీకి ఆదివారం జిల్లాకు చేరుకుంది. గంజాల్ వద్ద కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ క్రీడా జ్యోతి వెలిగించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ టార్చ్ ర్యాలీ చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈటీఎం పర్యటిస్తుందన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్‌ఈశ్వర్, క్రీడల అధికారి శ్రీకాంత్, భూక్యా రమేష్, శ్రీధర్‌రెడ్డి, క్రీడాకారులు, ప్రతినిధులు, యువత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతితో ర్యాలీలో ఎమ్మెల్యే, కలెక్టర్



మల్లాపూర్‌లో బోనాల జాతర సందర్భంగా పోతరాజుల నృత్యాలు



- దిలావర్‌పూర్‌లో పోచమ్మ భక్తజన జాతర
- బంగారు నగలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

అడెల్లి పోచమ్మ తల్లీ సల్లంగా చూడమ్మా..

- ఘనంగా అడెల్లి పోచమ్మ గంగనీళ్ల జాతర
- వేలాదిగా తరలివచ్చిన జనం
- దిలావర్‌పూర్‌లోని పోచమ్మ వద్ద భక్తుల నీరా'జనం'
- లక్ష్మణచాందలోని మల్లాపూర్‌లో ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

సారంగాపూర్,అక్టోబరు6: అడెల్లి పోచమ్మ తల్లి.. చల్లంగా చూడమ్మంటూ భక్తులు అమ్మవారికి నీరాజనం పలికారు. సారంగాపూర్ మండలంలోని అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర ఆదివారం వైభవంగా సాగింది. రెండ్రోరోజుల పాటు కన్నుల పండుగా సాగిన అడెల్లి పోచమ్మ జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం మధ్యాహ్నం పోచమ్మ నగలను అడెల్లి దేవాలయం నుంచి వేలాదిమంది భక్తులు కాలినడకతో 30 కిలోమీటర్లపాటు గోదావరి నదికి తీసుకెళ్లారు. తిరిగి నగలను దేవాలయానికి తీసుకొచ్చి అమ్మవారిని నగలతో అలంకరించారు. ఆదివారం వేకువజామున నుంచి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి నాందేడ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పెరుగన్నంను నైవేద్యంగా సమర్పించి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు ఎడ్లబండ్లపై కాలినడకన ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో అడెల్లి పోచమ్మ జాతరకు తరలివచ్చారు. స్థానిక వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

• గట్టి బందోబస్తు

అడెల్లి మహాపోచమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులను ఎదుర్కొకుండా ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్ గౌడ్ వాలంటీర్లను నియమించారు. తాగునీటి ఎద్దడి లేకుండా ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.



- బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

గ్రామాల్లో మంగళహారతులతో స్వాగతం

గోదావరి నుంచి అమ్మవారి నగలను శుద్ధిచేసుకొని కాలినడకతో వచ్చే సమయంలో గ్రామగ్రామాన మహిళలు మంగళహారతులతో అమ్మవారి నగలను స్వాగతం పలికారు. అమ్మవారి నగలను ఎత్తుకున్న భక్తులకు రాగి బిందెలతో నీళ్ల తెచ్చి కాళ్లను కడిగి, టెంకాయలను కొట్టి, మొక్కులు మొక్కి అమ్మవారి బండారిని పెట్టుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

అడెల్లి పోచమ్మ ఆలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్లు ఐటీ చందు, శ్రీనివాస్‌రెడ్డి, ఉట్ల రాజేశ్వర్, మాధవ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ్ మహ్మద్, నాయకులు శంకర్, మల్లేష్, కరిపే విలాస్, చంద్రప్రకాష్ గౌడ్, రాంశంకర్ రెడ్డి, గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను మొక్కారు. అలాగే పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి పూజారి శ్రీనివాస్ పూజలు చేసి హారతినిచ్చారు.

పోచమ్మ తల్లికి నీరా'జనం'

దిలావర్‌పూర్: అడెల్లి మహాపోచమ్మ తల్లికిభక్తులు అడుగడుగునా నీరాజనం పలికారు. శనివారం రాత్రి సాంగ్వి చేరుకున్న పోచమ్మ తల్లి గ్రామంలోని గంగ పోచమ్మచెంత నిద్దురోయింది. ఆదివారం తెల్లవారు జాము గోదావరి నదీమ తల్లిచెంతకు చేరింది. పవిత్ర గోదావరి నదీమ తల్లి జలాలతో మహాపోచమ్మ వారి ఆభరణాలను శుద్ధిచేసిన అనంతరం ఆభరణాల మూటతో వేలాదిమంది భక్తులు వెంటరాగా భారీపోలీస్ బందోబస్తు మధ్య అమ్మవారు తిరిగి తన సన్నిధి అడెల్లికి బయలెల్లింది. సాంగ్వి గంగ పోచమ్మ ఆలయ కమిటీ స భ్యులు, వీడీసీ సభ్యులు, దిలావర్‌పూర్ వీడీసీ సభ్యులు, హిందూవాహిని కార్యకర్తలు అమ్మవారిని గ్రామం నుంచి సాగనంపే వరకు వాలంటీర్లుగా సేవలందించారు. ఓమో జయ పరివారం భక్తులకు తాగునీటిని పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న పోతరాజుల నృత్యాలు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన బోనాల జాతరలో పోతరాజులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మునిపెల్లిలో నిర్వహించిన బోనాల జాతరలో మహిళలు మంగళహారతుల స్వాగతాల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. మహిళలు, యువతుల జై అమ్మా భవాని అంటూ చేసిన నినాదాలు ఆయా గ్రామాల్లో మార్మోగాయి.



అమ్మవారి నగలను గోదావరిలో శుద్ధి చేసి తీసుకెళ్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మాల ఉద్యోగుల జేఏసీ నాయకులు

'రాష్ట్ర ఉప మంత్రి వర్గాన్ని రద్దు చేయండి'

నిర్మల్ అర్బన్, అక్టోబరు6: ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాష్ట్ర ఉపమంత్రి వర్గాన్ని రద్దు చేయాలని తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం డిమాండ్‌చేసింది. ఆదివారం రోజు స్థానిక టీఎన్జీవో సంఘ భవనంలో మాల ఉద్యోగుల జేఏసీ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 1 ఆగస్టు 2024న సుప్రీం కోర్టు తీర్పు అసంబద్ధము, చట్ట సమ్మతముగా లేదని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే అవకాశాన్ని ప్రభుత్వం మానుకోవాలని, లేనిపక్షంలో గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వి. ప్రభాకర్, కొంతం అడెల్లు, గంగారపు రాజేశ్వర్, కే. వెంకటస్వామి, బత్తుల రంజిత్, బొడ్డు లక్ష్మణ్, రాజేశ్వర్, డి. రాములు, మైపాల్ ప్రభుదాస్, డాక్టర్ ముఖేష్, డాక్టర్ శ్యామ్, ప్రొఫెసర్ మధు, డాక్టర్ ప్రభాకర్ షానే, తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఉద్యోగాలలో ప్రమోషన్ పొందినవారికి, సంఘాలలో రాష్ట్రస్థాయి పదవులు పొందినవారికి సన్మానించారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాకాల రాంచందర్



పాకాల రాంచందర్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 6: తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాకాల రాంచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.



బీజేపీ సభ్యత్వ నమోదు చేపడుతున్న బీజేపీ నాయకులు

'పార్టీ పటిష్టతకు ప్రతీఒక్కరు కృషి చేయాలి'

కుంటాల, అక్టోబరు6: భారతీయ జనతా పార్టీ పటిష్టతకు ప్రతీఒక్కరు కృషిచేయాలని భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు జీవీ రమణరావు అన్నారు ఆదివారం కుంటాల మండలంలోని ఓలా, లింబా (కే) గ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సభ్యత్వ నమోదుకు యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల గజేందర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి శివ, పార్టీ నాయకులు సుదర్శన్ పటేల్, శరత్ గౌడ్, ఎగ్గాం నర్సింలు, అశోక్, కేశవ్ పటేల్ ఉన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

కుంటాల, అక్టోబరు 6: కుంటాల మండలంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గత నాలుగు రోజుల నుంచి ఈ ఉత్సవాలు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ నైవేద్యాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు రాత్రి వేళలో భజనలు, కోలాటలు నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా మండలంలోని అంబకంటిలో దుర్గానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్రసేన యూత్ ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు నెత్తిన భోనాలతో బాజాభజంత్రిలతో బ్యాండుమేళాల మధ్యన ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నల్దుర్తిలో బోనమెత్తిన మహిళలు

మామడ, అక్టోబరు 6: మండలంలోని నల్దుర్తి గ్రామంలో ఆదివారం రోజున పవన సుత యూత్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత మండపం నుండి ఊరేగింపుగా మహిళలు బోనాలు ఎత్తుకొని వీధుల గుండా దుర్గామాత నామస్మరణతో డీజే సౌండ్‌లతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లంగా చూడు దుర్గామాత అంటూ నమస్కరించుకున్నారు. ప్రతీఏటా ఈ కార్యక్రమం ఆనవాయితీగా చేస్తారు. అనంతరం భక్తులకు పవన సుత యూత్ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. దుర్గామాత మండపంలో మంగళవారం రోజున పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గామాత ఆశీర్వాదం పొందాలని కోరారు.



నల్దుర్తిలో బోనాలతో వస్తున్న మహిళలు

సంక్షిప్త సమాచారం

మారణాయుధాలు గల వ్యక్తి అరెస్టు

నిర్మల్‌కల్చరల్, అక్టోబరు6: నిర్మల్ పట్టణం చింతకుంటవాడలో మెంగా రాజేష్ అనే వ్యక్తి మారణాయుధాలు కలిగి ఉండడంతో అతడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్‌లో రెస్టారెంట్ నడిపిస్తున్న ఆయన ఏదైనా గొడవలు జరిగితే ఉపయోగించుకునేందుకు గుర్తు తెలియని వ్యక్తి వద్ద తల్వార్ కొనుగోలు చేసి తన కౌంటర్ కింద దాచాడని చెప్పారు. ఆయుధాన్ని వేరే చోటికి తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసునమోదు చేసి అరెస్ట్ చేశామని, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

దిలావర్‌పూర్‌లో యువకుడి ఆత్మహత్య

దిలావర్‌పూర్, అక్టోబరు6: మండల కేంద్రానికి చెందిన ఆడెపు రాజు (25) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆడెపు రాజు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చాలా ఆసుపత్రులు తిరిగినా తగ్గలేదు. పెద్దఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆర్థిక స్థోమత లేక మనస్థాపం చెంది రాజు శనివారం రాత్రి కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం చెరువు వైపు వెళ్లినవారు నీటిలో తేలిన మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్ (జి), అక్టోబరు6: మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-04 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి విద్యా గురువులు, విద్యార్థులు హాజరయ్యారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

భైంసా, అక్టోబరు 6: ఓ అమ్మాయి, అబ్బాయి మధ్య జరిగిన వ్యవహారానికి సంబంధించి భైంసాలో చోటుచేసుకున్న ఘటనపై పోలీసులు హిందూ యువకులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తి వేయిచాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సమితి శ్రేణులు కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సంబంధిత విషయంలో కలిసి వినతి పత్రం అందచేశారు. ఘటనకు సంబంధించి వివరాలను తెలిపారు. నమోదు చేసిన కేసులు, సెక్షన్ల అంశాలను వివరించారు. ఇందుకు స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ సంబంధిత కేసుల విషయంలో పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్‌ద్వారా మాట్లాడినట్లుగా సమితి శ్రేణులు వెల్లడించాయి. అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేసేలా చూడాలని కేంద్ర మంత్రి పోలీసు ఉన్నతాధికారులకు సూచించారని సమితి శ్రేణులు పేర్కొన్నాయి.

గర్భిణీని ఆసుపత్రిలో చేర్పించిన పోలీసులు



ఆసుపత్రి వద్ద గర్భిణితో పోలీసులు

భైంసా రూరల్, అక్టోబరు 6: మండలంలోని ఎగ్గాం గ్రామంలో రాత్రి ఒంటి గంట సమయంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని పోలీసులు ఆసుపత్రి చేర్చారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆమె భర్త వాహనం కోసం ఎదురుచూస్తుండగా అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు విషయం తెలుసుకుని ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది గర్భిణిని స్పందించి తమ వాహనంలో ఎక్కించుకొని భైంసా పట్టణంలో ఓ ఆసుపత్రికి చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోజుకో మలుపు తిరుగుతున్న మొరం దందా వివాదం

- ఇద్దరు వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు • స్థానిక తహసీల్దార్‌పై సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు

ఖానాపూర్, అక్టోబరు6: ఖానాపూర్‌లో కొద్దిరోజులుగా సాగుతున్న మొరం దందా వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. శుక్రవారం రాత్రి సోషల్ మీడియా వేదికగా ఓ వ్యక్తి చేసిన మెసేజ్ శనివారం పెను దుమారం రేపింది. ఖానాపూర్‌కు చెందిన నాయిని రాజేశ్వర్ సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులకు మొరం దందాకు సంబంధించిన ముడుపులు అందాయని అందుకే మొరం దందాకు సహకరిస్తున్నారని మెసేజ్‌తో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ శ్రేణులు శనివారం అతనిపై ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తమకు డబ్బులు ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటున్న పానుగంటి రాజేందర్ అనే వ్యక్తిపై సైతం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషాలు తెలిపారు. అనంతరం మొరం తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులకు తహసీల్దార్ శివరాజ్ విస్తుపోయే సమాధానం ఇచ్చారు. అక్రమంగా తరలిస్తున్న మొరం దందాను నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని కోరిన కాంగ్రెస్ నాయకులతో తాను ఇదివరకే మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, తాను మొరం దందాను ఆపలేనని, తన ఇష్టం వచ్చినట్లు చేసుకోవాలని తహసీల్దార్ తెగేసి చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ శ్రేణులు వెంటనే కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని మొరం దందాను అరికట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆదివారం తెలిపారు. ప్రభుత్వ పెద్దల దృష్టికి సైతం తీసుకెళ్లి సంబంధిత అధికారిపై చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు. ఫిర్యాదుపై కోర్టు అనుమతి కోరనున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.



మొరం తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

అక్రమంగా మొరం దందాకు సహకరిస్తున్న ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొరం దందాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామన్నారు.

స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో
ఘనంగా బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భైంసా, అక్టోబరు6: పట్టణంలో ఆదివారం స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సంతోషిమాత మందిర ప్రాంతంలోని స్వర్ణకార సంఘ భవనంలో మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. బతుకమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పాటలు పాడుతూ, కోలాటాలు వేస్తూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు శోభా యాత్రగా తరలివెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

'బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి'

ముథోల్, అక్టోబరు6: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సుష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్, వెంకటాపూర్, చించాల, తరోడా గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతీ గ్రామం నుంచి ఎంతో మంది బీజేపీని ఆదరించారని వారందరికీ సభ్యత్వం ఇచ్చేలా ప్రయత్నం చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో లక్ష 20వేల వరకు సభ్యత్వం నమోదు చేయడమే లక్ష్యంగా బూత్‌స్థాయి లెవల్ నుంచి ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ముథోల్ తాలూకా కోఆర్డినేటర్ సాంప్లీ రమేష్, మండల సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సతీష్ రెడ్డి, బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న, పి.శివరాం, సాయినాథ్, శ్రీనివాస్, దత్తు, ఉదయ్, దిగంబర్ పటేల్, నిమ్మ పోతన్న, రవి, గ్రామస్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జైనథ్, అక్టోబరు 6: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో ఆగిఉన్న ఐచర్‌వ్యాన్‌ను ఆదివారం ఉదయం ఢీకొని హర్షవర్ధన్(17) అనే యువకుడు అక్కడి కక్కడే దుర్మరణం చెందాడు. ఎస్సై వి.పురుషోత్తం, స్థానికుల కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన హర్షవర్ధన్, ఆయన స్నేహితుడు పూంద్రు నిరజ్‌రెడ్డితో కలిసి పొరుగు రాష్ట్రమైన కేలాపూర్ జగదాంబా మాత ఆలయానికి పాదయాత్రగా శనివారం వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. వీరిద్దరు స్కూటీ (టీఎస్01ఈఎన్5276)పై కేలాపూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తుండగా పిప్పర్‌వాడ టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న ఐచర్ వ్యాన్(కేఏ672295)ను స్కూటీ ఢీకొట్టింది. దీంతో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందగా.. నీరజ్ రెడ్డి(20)ని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

● బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్ అర్బన్: పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టారు. ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన హర్షవర్ధన్(17) అనే యువ కుడి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతి చెందిన హర్షవర్ధన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్ పరామర్శించారు. అదేవిధంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరొక యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

'సామాజిక సేవ బాధ్యతగా చేపట్టాలి'

తలమడుగు, అక్టోబరు 6: ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ ధర్మంతో పాటు సామాజిక సేవా బాధ్యతగా చేపట్టాలని బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ఆల్ ఇండియా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని పల్సి(బి) గ్రామంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కాంతారావు మాట్లాడుతూ బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ఆల్ ఇండియా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులకు ఉచిత వైద్య శిబిరంతో పాటు వారికి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

సోనాల యువకుడికి జాతీయ అవార్డు

బోథ్, అక్టోబరు 6: మండలంలోని సోనాల గ్రామానికి చెందిన బాశెట్టి రాజ్‌కుమార్ వివేకానంద జాతీయ అవార్డు ఆదివారం అందుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన దక్షిణ భారతదేశ బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదవ రచయితల సమ్మేళనంలో ఈ అవార్డును బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. సైబర్ క్రైమ్ నేరాలు, పర్యావరణ పరిరక్షణ నవ సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయుడి పాత్ర గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించడంతో అవార్డు వచ్చిందని

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖానాపూర్, అక్టోబరు6: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఖానాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాహుల్ తెలిపిన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా గల అపార్ట్‌మెంట్ భవనంలో ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎరుపు రంగుచొక్కా, నీలం రంగు ప్యాంటును ధరించిన సదరు వ్యక్తి గత కొంతకాలంగా ఖానాపూర్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. సదరు వ్యక్తి మృత దేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో పెట్టి ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాల గదిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా సదరు వ్యక్తి ఆనవాళ్లు గుర్తిస్తే ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

దుర్గామాత ఆలయానికి సౌండ్ సిస్టం అందజేత

భైంసారూరల్, అక్టోబరు6: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో చింతచెట్టు కాండంలో స్వయంభుగా వెలసిన దుర్గామాతకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున సుమారు రూ.54వేల విలువైన మైక్, సౌండ్ సిస్టం(స్పీకర్లు)ను, ఎంప్లిఫైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు కడారి దశరథ్, గణపతి, భోజరాం, అట్లోలి భూమన్న, శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, అంజయ్య, సోనా గాంధీ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

దసరా పండుగ ఏర్పాట్ల పరిశీలన

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 6 : నిర్మల్ జిల్లా కేంద్రంలో దసరా పండగ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించారు. పెద్దసంఖ్యలో విజయదశమి సందర్భంగా ప్రజలు అమ్మవారిని దర్శించుకొని వేడుకల్లో పాల్గొనున్నారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజులకు పలు సూచనలు చేశారు. స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


దసరా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆదివారం నంది గుండం దుర్గామాతను దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. విజయదశమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి


- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి


కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం


రాజుయాదవ్


శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



● టూ వీలర్, వాటర్ వాషింగ్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు



● ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో గల ఆర్‌సెట్ శిక్షణ భవనం

- జిల్లాలోని ఉట్నూర్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటు
- నిరుద్యోగ యువత కోసం పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు
- ప్రతీ గ్రూపునకు 35 మంది ఎంపిక
- ద్విచక్ర వాహనాలు, ఫొటోగ్రఫీ, కుట్లు, అల్లికలతో పాటు మొదలగు అంశాలలో శిక్షణ
- జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు స్వయం ఉపాధి పొందుతున్న వేలాది మంది యువత

ఉపాధి శిక్షణతో.. చేయూత



ఉట్నూర్, అక్టోబరు 6: ఎన్ని చదువులు చదివినా ఏమున్నది గర్వకారణం! అని అనుకోకుండా, స్వయం ఉపాధి శిక్షణ కోర్సుల వైపు తొంగి చూస్తున్న యువతీ యువకులకు 'నేనున్నాను' అంటూ నమ్మకం కలిగిస్తోంది ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్‌లో నెలకొల్పిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ. నిరుద్యోగులు నిరాశకు గురికాకుండా స్వయం ఉపాధి శిక్షణలతో ఆర్థిక వనరులు పొందవచ్చని, మరికొందరికి మార్గదర్శకులుగా నిలువవచ్చని నమ్మకం కలిగించడంతో పాటు స్వయం ఉపాధి రంగాలలో స్థిరపడేలా శిక్షణలు ఇస్తున్నారు.

పలు అంశాల్లో శిక్షణ

ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో గ్రామీణ యువతీ, యువకులకు స్వయం ఉపాధి రంగాలలో శిక్షణలు అందిస్తున్నారు. ఈ శిక్షణ సంస్థలో అనేక శిక్షణ కార్యక్రమాలు ఫొటోగ్రఫీ, ద్విచక్ర వాహనాల రిపేరింగ్, కుట్టు శిక్షణ, మగ్గం వర్క్స్, అల్లికలు, జూట్ బ్యాగుల తయారీ, కంప్యూటర్ శిక్షణ, మోటార్ వైన్డింగ్, హౌజ్ వైరింగ్, బ్యూటీషియన్ లాంటి అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉచిత భోజన వసతి

గత కొన్ని నెలల క్రితం ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ శిక్షణ కార్యక్రమానికి 35 మందిని ఎంపిక చేస్తున్నారు. ఎంపిక చేసిన వారికి ఉచిత భోజన వసతి కల్పించడంతో పాటు ఉదయం సాయంత్రం యోగా శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. యువతీ, యువకులకు వేర్వేరుగా శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇప్పటి వరకు 300కు పైగా గ్రూపులలో స్వయం ఉపాధి రంగాలలో రాణించడానికి శిక్షణలో ఇవ్వడం జరిగింది. మొత్తం 9వేల మందికి పైగా నిరుద్యోగులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 3,250 మంది వరకు అధికారుల ప్రోత్సాహంతో బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధి కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నారు.

గ్రామీణ యువతకు శిక్షణ

గత నెల రోజులుగా పదో తరగతి చదువుకున్న ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు 70 మందికి ద్విచక్ర వాహనాల శిక్షణతో పాటు ఫొటోగ్రఫీలో శిక్షణ అమలు చేస్తున్నారు. ప్రతీ గ్రూపునకు 35 మందికి మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు ఇంటింటికీ ఉన్నందున గ్రామీణ యువతకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావించారు. అదేకాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఫొటోగ్రాఫర్ల అవసరాలు ఎంతో ఉన్నాయని, వారికి కూడా ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తే.. వారు కూడా గ్రామాలలో స్టూడియోలు ఏర్పాటు చేసుకుని జీవనాధారంగా బతకడంతో పాటు ప్రజల అవసరాలు కూడా తీరుస్తారని అధికారులు భావించి ఈ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు బ్యాంకు ద్వారా ఆర్థిక రుణం అందించేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఆర్‌సెట్ శిక్షణలపై ఆసక్తి పెరిగి నిరుద్యోగులు శిక్షణ కోసం పరుగులు పెడుతున్నారు.

ఫొటోగ్రఫీలో శిక్షణ పొందుతున్నా..

: మహేందర్, నిరుద్యోగి, ఇచ్చోడ

నేను పదవ తరగతి వరకు చదువుకొని ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాను. అయితే, ఉట్నూర్‌లోని ఆర్‌సెట్ ద్వారా ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చి శిక్షణ పొందాను. ఇచ్చోడ మండల కేంద్రంలో ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేస్తే ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకుంటా.



బైక్ రిపేరింగ్‌లో శిక్షణ పూర్తి చేశా..

: ఆత్రం శ్రీకాంత్, నిరుద్యోగి, తిర్యాణి

నేను కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన తిర్యాని నుంచి వచ్చా. పదవ తరగతి పూర్తి చేశాను. ఇప్పటి వరకు నాకు ఏ ఉద్యోగం రాలేదు. గ్రామీణ ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు అందరూ కొనుగోలు చేస్తున్నారు. దీంతో టూ వీలర్ రిపేరింగ్‌లో శిక్షణ పొందాలని వచ్చి ఇక్కడ చేరాను. శిక్షణతో పాటు అధికారులు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అంతేకాకుండా తిర్యాని మండల కేంద్రంలో టూ వీలర్ రిపేరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుంటా.



ద్విచక్ర వాహనాల రిపేరింగ్ నేర్పించాం

: షకీల్, ఇన్‌స్ట్రక్టర్(శిక్షకుడు), ఉట్నూర్

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధికారులు ఎంపిక చేసిన 35 మంది నిరుద్యోగ యువకులకు టూ వీలర్ రిపేరింగ్‌లో శిక్షణ ఇచ్చాను. ద్విచక్ర వాహనాల మరమ్మతులతో పాటు వాహనాలు కడగడం ద్వారా కూడా ఉపాధి పొందేలా శిక్షణ ఇచ్చాం.



నిరుద్యోగులకు ఆశాదీపం

: మహమ్మద్ గౌస్, ఆర్ సెట్ డైరెక్టర్, ఉట్నూర్

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిరుద్యోగుల పాలిట ఆశాదీపంగా మారింది. ఇప్పటి వరకు 9వేల మందికి పైగా నిరుద్యోగులకు శిక్షణలు ఇవ్వడం జరిగింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి మార్గదర్శకులుగా మారుతున్నారు.



సంక్షిప్త సమాచారం

దుర్గమ్మకు ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ, అక్టోబరు 6: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శ్రీలలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో ఉన్న దుర్గమ్మకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండలంలోని రాజురా గ్రామంలో గల దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా, నేరడిగొండలో దుర్గమ్మ మండపాల వద్ద మహిళలు కుంకుమార్చనలు చేశారు.

నేడు తాంసిలో సోయా కొనుగోళ్ల ప్రారంభం

● హాజరుకానున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి, అక్టోబరు 6: సోయా కొనుగోళ్లను సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం మార్కెట్ యార్డులో ప్రారంభించనున్నట్లు సీఈవో కేశవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో సోయా పండించిన రైతులు సోయా దిగుబడులను తీసుకువచ్చి విక్రయించుకోవచ్చునని యన వివరించారు.

గిరిజన చట్టాలకు వ్యతిరేకం కాదు : జిల్లా అధ్యక్షుడు

ఇంద్రవెల్లి, అక్టోబరు 6: ఆదివాసీ గిరిజనులకు, గిరిజన చట్టాలకు తాము వ్యతిరేకం కాదని, ఏజెన్సీ చట్టం 1/70 కన్నా ముందు నుంచి ఇక్కడ గిరిజనులతో మమేకమై జీవిస్తున్న గిరిజనేతరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని గిరిజనేతరుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని గిరి జనేతర సంఘం ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేతకు నిరసనగా రెండో రోజు మార్కెట్ బంద్ పాటించి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు, గిరిజనేతరులు ఎలాంటి విభేదాలు లేకుండా కలిసి జీవనం సాగిస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్యం కంటే ముందు నుంచి ఉంటున్న భూములలో ఇళ్లు నిర్మించుకుంటున్నామని, 1/70 చట్టం పేరిట కూల్చి వేయడంతో తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం తేవడానికి కన్నా ముందు నుంచి ఇక్కడ నివసిస్తున్న గిరిజనేతరులకు హక్కులను కల్పించాలని, ప్రభుత్వం గిరిజనేతరులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో గిరిజనేతర మండలాధ్యక్షుడు డోంగ్రే మారుతి పటేల్, ఉట్నూర్ మండలాధ్యక్షుడు దావుల రమేష్, నార్నూర్ మండల అధ్యక్షుడు కేంద్రే మాధవ్, నాయకులు ఎండీ మసూద్, లాహనే సంజీవ్, ముస్లే కేశవ్, ఆడావ్ చంపత్‌రావు, మిర్జా జిలానీబేగ్, మోరే దిలీప్, కాంబ్లే ఉత్తం, సావంత్ లహుదాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు విలువైనవి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● హైదరాబాద్ నుంచి జిల్లా సందర్శనకు తరలివచ్చిన ఆయా విశ్వవిద్యాలయాల విద్యార్థులు



విద్యార్థులతో కలిసి కేబీ కాంప్లెక్స్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే



రాంజీగోండు నగర్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తూ..

ఉట్నూర్, అక్టోబరు 6: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నాగరికల కంటే భిన్నంగా ఉంటాయని, ఆదివాసీల సంప్రదాయాలు ఎంతో విలువైనవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. అయిస్టర్ స్వచంధ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 4రోజుల ఆదిలాబాద్ సందర్శనకు వచ్చిన విద్యార్థులతో ఆదివారం కొమురంభీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఎమ్మెల్యేతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆదివాసీ ప్రజల యొక్క సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికత, వారి జీవన శైలి గురించి వివరించారు. భావితరాలకు ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను అందించడానికి ప్రతీ గిరిజన గ్రామంలో ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాల యం, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం, హైదరాబాద్ విశ్వ విద్యాలయం, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొని ఎమ్మెల్యేతో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేబీ కాంప్లెక్స్‌లో మొక్కలు నాటారు. ఇందులో అయిస్టర్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌సింగాడే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సోహెల్, రజిత, భాగ్యశ్రీ, రిషిక, అక్షిత, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

● దుర్గాదేవికి పూజలు చేసిన ఎమ్మెల్యే

ఉట్నూర్: మండలంలోని రాంజీగోండు నగర్ కాలనీలో కొలువుదీరిన దుర్గాదేవికి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి దంపతులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఆదివారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించిన వెడ్మ మనిషాను శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడే తత్త్వం, పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో లక్ష్యం గొప్పదై ఉండాలని పేర్కొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ అయిన 9 రోజులకు

గిరిజన మహిళ మృతి

- వైద్యం వికటించడం వల్లనే అంటూ సోషల్ మీడియాలో వైరల్
- చర్యలకు మాజీ ఎంపీపీ డిమాండ్
- తప్పుడు ప్రచారం చేసే వారిపై ఫిర్యాదు చేస్తాం : ఆసుపత్రి వైద్యుడు



మృతి చెందిన గిరిజన మహిళ రేణుక (ఫైల్)

బోథ్, అక్టోబరు 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఏడాది మార్చి 6న ఇచ్చోడ మండలంలోని ముక్రా గ్రామ పంచాయతీ పరిధిలోని మాన్‌కుగూడ గ్రామానికి చెందిన రేణుక కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిమిత్తం బోథ్ ఆసుపత్రిలో చేరింది. దీంతో అక్కడ ఉన్న ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ చేసి అదేనెలా 9న ఇంటికి పంపడం జరిగింది. అయితే ఆపరేషన్ చేసుకున్న మహిళ తమ ఇంటికి వెళ్లకుండా.. బోథ్ మండలంలోని సాంగ్వి గ్రామంలోని ఆమె అక్క ఇంటికి వెళ్లడం జరిగింది. అయితే ఆపరేషన్ అయిన మహిళ మార్చి 14న రాత్రి అస్వస్థతకు గురికావడంతో ఆమె బంధువులు కౌటా(బి) గ్రామంలో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లడం జరిగింది. అయితే ప్రైవేట్ ఆసుపత్రికి రాక ముందే మహిళ మృతి చెందినట్లు డాక్టర్ బంధువులకు తెలిపారు. దీంతో వారు మృతురాలి కుటుంబీకులకు సమాచారాన్ని ఇచ్చి మృతదేహాన్ని మాన్‌కుగూడకు తీసుకెళ్లారు. ఆపరేషన్ అయినా తొమ్మిది రోజులకు ఆమె మృతి చెందడంతో కుటుంబీకులు, ఆమె భర్త అయిన ఆడ విజయ్‌కుమార్ స్థానిక బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం.. ఆ వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం స్థానిక వైద్యులతో కలిసి మృతురాలి స్వగ్రామమైన మాన్‌కుగూడలో పోస్టుమార్టం నిర్వహించారు. అయితే మృతురాలి కుటుంబానికి అప్పుడే రూ.30 వేలను వైద్యులు ఆర్థిక సహాయంగా అందించారు. దీంతో కొంత మంది గిరిజన మహిళ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ.. ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ వెంటనే పోస్టుమార్టం నిర్వహించడం జరిగింది.

● సోషల్ మీడియాలో ప్రచారం

మహిళ చనిపోయిన ఆరు నెలల తరువాత సోషల్ మీడియాలో ఆదివారం ఉదయం నుంచి ఇందుకు సంబంధించిన కుటుంబీకులు మాట్లాడిన వీడియో రికార్డులు బోథ్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు గంగాధర్ అనే వ్యక్తి సంఘటనను ప్రెస్ గ్రూపులో ఇతర బోథ్‌కు సంబంధించిన గ్రూపులో పలువురు పోస్టు చేయడం జరిగింది. దీంతో స్పందించిన డాక్టర్ తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. అయినా పట్టువదలకుండా కొంత మంది వ్యక్తులు ఈ విషయాన్ని ప్రచార మాధ్యమాల్లో పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

● కేసులు పెడతాం : స్థానిక వైద్యుడు

మార్చి 6న బోథ్ ఆసుపత్రిలో వైద్యం పొందిన గిరిజన మహిళ మార్చి నెల 14న రాత్రి అతిసార బారినపడి మృతి చెందింది. అయితే ఈ విషయం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతి గల కారణాలను తెలుసుకునేందుకు ఫ్లోరెన్స్ సైన్స్ ల్యాబ్‌కు పంపించడం జరిగింది. అయితే రిపోర్టులో సైతం డీహైడ్రేషన్ వల్ల మృతి చెందిందని రిపోర్టు రావడం జరిగిందని డాక్టర్ తెలిపారు. దీనిని అసలు విషయం తెలియకుండా కొందరు సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా మృతురాలి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మానవతా దృక్పథంతో రూ.30 వేలు ఇవ్వడం జరిగిందని స్థానిక వైద్యులు పేర్కొన్నారు.

● బాధ్యులపై చర్యలకు డిమాండ్ : ఎంపీపీ

కాగా, ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన గిరిజన మహిళ వైద్యం వికటించి మృతి చెందిందని, అందుకు బాధ్యులైన డాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని ఆరోపిస్తూ బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబీకులను మభ్యపెట్టేందుకే 30 వేల రూపాయలు ఇచ్చి వైద్యులు చేతులు దులుపుకున్నారంటూ ఆయన మండిపడ్డారు. ఈ విషయమై మరిన్ని ఆధారాలతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.



జాతరకు వెళ్లి తిరిగివచ్చిన వారికి స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

గంగనీళ్ల జాతరకు తరలిన భక్తులు

బోథ్, అక్టోబరు 6: మండలంలోని పార్డీ(కె) గ్రామం నుంచి పోచమ్మ తల్లి ఆభరణాలు వెంట తీసుకుని గంగనీళ్ల జాతరకు వెళ్లిన భక్తులు తిరిగి ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. కాగా గ్రామానికి వచ్చిన వారిని డప్పు వాయిద్యాలతో స్థానికులు ఘనంగా స్వాగతించారు. ఆభరణాలు తీసుకు వెళ్లి గంగనీళ్లతో శుభ్రం చేసి తీసుకురావడంతో గ్రామస్థులు పోచమ్మ ఆభరణాలను స్వాగతించారు. ఇందులో గ్రామ పటేల్ అమృతరావు, దేవారి జైతూ, తుకారం, పెందూర్ జైతు, రమేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవన నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 6: జిల్లా కేంద్రంలో బంజారా భవన నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలె పాయల్ శంకర్, అనిల్ జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.2 కోట్ల నిధుల వ్యయంతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

● రూ.9.50 లక్షలతో అభివృద్ధి పనులు

ఆదిలాబాద్‌లోని మున్నూర్‌కాపు సంఘ భవన అభివృద్ధికి తమవంతు కృషి చేస్తూనే ఉంటామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మున్నూరు కాపు సంఘ భవనం మౌలిక సదుపాయాల కోసం రూ.9.50 లక్షల నిధుల వ్యయంతో ఎంపీ నగేష్, సంఘం నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. సాధ్యమైనంత వరకు ఆయా సంఘ భవనాలను సైతం మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేకదృష్టి సారించామన్నారు.

● సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టీ) గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీలో చేరిన తాజామాజీ సర్పంచ్ దాట్ల భాస్కర్, ఉప సర్పంచ్ దేవల్ల కిషన్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరె మోహన్‌లకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ పార్టీ సభ్యత్వం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● యువత క్రీడల్లో రాణించాలి : ఎంపీ

ఆదిలాబాద్ రూరల్: పల్లెల నుంచి జాతీయ స్థాయి విజేతలుగా ఎదిగేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్-2024 పేరిట నిర్వహిస్తున్న టార్చ్ ర్యాలీ ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. మావల బైపాస్ వద్ద ఎంపీ గోడం నగేష్‌తో పాటు జిల్లాకు చెందిన అధికారులు ఘన స్వాగతం పలికి, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంపీ సూచించారు. తర్వాత ఎంపీ క్రీడాజ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్